# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి




అమరశిల్పి జక్కన్న చిత్రంలోని 'నిలువుమా నిలువుమా నీలవేణీ..' అనే పాటని సాలూరు వారు బహుదారి రాగంలో స్వరపరిచారు. చిత్రసీమలో బహుదారి రాగాన్ని వాడింది సాలూరు వారేనని చాలామంది ప్రశంసిస్తారు.

సాలూరు రాజేశ్వరరావు గారు 'లక్ష్మీ నిలయం' అనే ఒక సినిమాలో "ముద్దుల గుమ్మ మోజులు ఎన్నో తెచ్చింది..అన్నీ నీకే ఇస్తా తీసుకో..' (రచయిత: ఎమ్.కె.రాము) అనే పాటని స్వరపరిచారు. ఐతే ఆ సినిమా తరువాత విడుదలకి నోచుకోలేదు. పాటలోని పల్లవి టేకాఫ్‌ని రాజేశ్వరరావు గారి అబ్బాయి కోటి 'నువ్వేకావాలి' చిత్రంలోని 'ఎక్కడవున్నా..'అనే పాటలో వాడుకున్నారు.

***



జయభేరి సినిమా విడుదలవుతున్న రోజునో ఆ కిందటి రోజునో పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. అందులో సాంకేతిక నిపుణుల పేర్ల వెనకాల అందరికీ వాళ్ళ డిగ్రీలు కూడా రాసారు. అలానే మల్లాది రామకృష్ణ శాస్త్రి ఎమ్.ఎ. అని రాసారు. ఇది చూసిన శాస్త్రి గారు అగ్గిమీద గుగ్గిలం ఐపోయారు. ఎవరు అలా ప్రకటన తయారు చేయించారా అని వాకబుచేస్తే పేకేటి శివరామ్ అని చెప్పారు. వెంటనే శాస్త్రి గారు పేకేటి శివరామ్‌ని పిలిపించి " పేరు వెనుక ఎమ్మే ఎప్పుడైనా వేసుకున్నానా - నేనే మర్చిపోయాను కదా.. నాకు మూడు ఎమ్మేలు కాదు, తలమీద నాలుగు వెంట్రుకలు కూడా వున్నాయి. ఈ సారి నా పేరు వేస్తే ఫోర్ హెయిర్ అనికూడా వెయ్యి' అని తారాస్థాయిలో విరుచుకుపడ్డారు.

***



ప్రేమ్ నగర్ చిత్రంలో ఆత్రేయ వ్రాసిన 'మనసు గతి ఇంతే..మనిషి బ్రతుకింతే..' అనేపాట గుర్తులేని సినీ అభిమానులు ఉండరనుకుంటాను. ఆ పాట సాహిత్యంలో ఎక్కువగా నిరాశే ధ్వనిస్తుంది. అది కథాపరంగా వచ్చింది కావొచ్చు , ఆత్రేయ పాటల్లో ఎక్కువగా వినిపించే విరహ ధ్వని కూడా కావొచ్చు. ఈ సినిమా వచ్చిన కొద్ది కాలానికే 'పవిత్రహృదయాలు'అనే సినిమా వచ్చింది. అందులో సి.నారాయణ రెడ్డి గారు ఈ నిరాశా వాదానికి పూర్తి వ్యతిరేకంగా ఆశావాదంతో ఒక పాట రాసారు. దాని పుట్టుక గురించి ఒక చోట సినారె ఇలా వ్రాసారు.

"పవిత్రహృదయాలు చిత్ర సంగీత దర్శకులు టి.చలపతి రావు. పాటల సిటింగ్‌లో ఉన్నప్పుడు ఆయన సినారె తో" అవునండీ ప్రేమ్ నగర్‌లో ఆత్రేయ 'మనసు గతి ఇంతే' అంటూ నిరాశావాదాన్ని



నూరిపోసారు. అదేమంత మెచ్చుకోతగ్గ విషయం కాదండీ..‘ అన్నారు. అందుకు నేనూ ’అవును. మనసు మనిషికి శిక్ష అని ఎందుకనుకోవాలి. వరం కావొచ్చు కదా. పక్షులకుంటాయా పరీక్షలు? రాళ్ళకు పడతాయా శిక్షలు? మనిషన్న వాడికే శిక్షలూ పరీక్షలు..అందుకే మనిషికి నిండు మనసు కావాలి‘ అన్నాను. అదే పాట రూపంలో ‘మనసే మనిషికి తీయని వరము‘ రూపుదిద్దుకుంది‘

***



చిత్రం: సాక్షిపత్రిక నుంచి

అలనాటి సినిమాల్లో అద్భుతమైన సాహితీ విలువలు కల పాటలు వ్రాసిన వారిలో సముద్రాల సుప్రసిద్ధులు. ఆయన పూర్తిపేరు సముద్రాల రాఘవాచార్యులు. వారి పెద్దబ్బాయి రామానుజం కూడా తరువాత జూనియర్ సముద్రాలగా చిత్రరంగప్రవేశం చేసి మరపురాని మధురగీతాలనెన్నింటినో అందించారు. అయితే సముద్రాల జూనియర్ చిత్రరంగ ప్రవేశం రచయితగా జరగలేదు. ఆయన వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్టుగా చలనచిత్ర జీవితాన్ని రంభించారు. తరువాత రచయితగా స్థిరపడ్డారు. ‘బతుకు తెరువు‘ చిత్రంలోని ‘అందమె ఆనందం..‘ అన్నపాట సీనియర్ సముద్రాల పేరుతోనే ప్రసిద్ధి చెందింది కానీ నిజానికి ఆ పాట రాసింది జూనియర్ సముద్రాలే . ఈ విషయాన్ని మరో ప్రముఖ రచయిత ఆరుద్ర ఒకచోట రాస్తూ ”ఆ పాటని ఘంటసాల తన ఇంట్లో ట్యూన్ చేస్తున్నప్పుడు నేను ప్రత్యక్ష సాక్షిని‘ అని రాసారు. ఎన్టీర్ గారి ‘పాండురంగ మహాత్మ్యం‘ సినిమాకి జూనియర్ సముద్రాల గారే మాటలు పాటలు రాసారు. ఆ స్క్రిప్టుని ప్రతిరోజూ స్నానం చేసాక, పొత్తు పంచెకట్టుకున్నాక, తిరుమణి, తిరు చూర్ణాలు పెట్టుకున్నాక మడిగా రాసేవారట. అలాంటి నిబద్ధత , శ్రద్ధ ఈ నాటి సినిమాల్లో ఎక్కడైనా వున్నాయా అని ప్రముఖులు పదే పదే అనుకోవడంలో తప్పులేదేమో..!

## అనువాద – అనుకరణ స్వరాలు

ఒక భాషలోని ట్యూన్స్‌ని మరో భాషలో అనుకరించడం, అరువు తెచ్చుకోవడం ఎప్పటినుంచీ వస్తున్న ఆచారమే. పాత సినిమాల్లో ఇలా అనుకరించబడిన చాలా స్వరాలకి తమిళ మాతృకలు ఎక్కువగా వుండేవి. దీనికి ఒక కారణం ఆయా తెలుగు సినిమాలని తమిళ సినిమాల ఆధారంగా నిర్మించడం కూడా.

కొన్ని ఉదాహరణలివిగో..

| **తెలుగు చిత్రం** | **పాట** | **తమిళ చిత్రం** | **ఒరిజినల్ పాట** |
|---|---|---|---|
| మంచి కుటుంబం | మనసే అందాల బృందావనం | మోటార్ సుందరం పిళ్ళై | మనమే మురుగనిన్ |
| సుమంగళి | కనులు కనులతో కలబడితే | శారద | ఒరుత్తి ఒరువనై.. . |
| కానిస్టేబుల్ కూతురు | చిగురాకుల ఊయలలో | పోలీస్ కారన్ మగళ్ | ఇందమండ్రత్తిల్.. |
| కానిస్టేబుల్ కూతురు | వెన్నెలకేలా నాపై కోపం | పోలీస్ కారన్ మగళ్ | నిలవుక్కు.. |

| | | | |
|---|---|---|---|
| మంచి చెడు | రేపంటి..రూపం కంటి.. | పాశం పాల్ | వన్నం పరువం.. |
| తోడు నీడ | అత్త ఒడి పువ్వు వలె.. | కర్పగం | అత్తమడి మెత్తమడి.. |
| పెళ్ళి కానుక | పులకించని మది పులకించు | కళ్యాణపరిసు | తుళ్ళాదమనముమ్ తుళ్ళుం.. |
| పెళ్ళికానుక | ఆడేపాడే పసివాడ | కళ్యాణపరిసు | ఉన్నై కండునాన ఆడ.. |
| రక్త సంబంధం | బంగారు బొమ్మ రావేమే | పాశమలర్ వారాయి | ఎన్ తోళి |
| మంచి మనసుకు మంచి రోజులు | ధరణికి గిరి భారమా | తైపిరందాళ్ వళి పిరుక్కుమ్ | మన్నుకు మరబారమా.. |

*అంతగా ప్రజాదరణ పొందని సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు*



ఆడది వెతికే అందం ఒకటే
వంచనలేని మంచి తనాన్నే
అప్పుడు మగడు వామనుడైనా
హిమాలయంలా కనపడును
ఆకారంలో యెలాగున్నా మన్మధుడల్లే ఉంటాడు

*నాకూపెళ్ళాం కావాలి ( 1987)*

మనిషిగా పుట్టినోడు తప్పు చేస్తు వుంటాడు
మనిషిగా మారినోడు దాన్ని ఒప్పుకుంటాడు

*మదనగోపాలుడు(1987)*



కలలకు భయపడి పోయాను
నిదురకు దూరం అయ్యాను
వేదనపడ్డాను
స్వప్నాలైతే క్షణికాలేగా
సత్యాలన్నీ నరకాలేగా
స్వప్నం సత్యమైతే వింత
సత్యం స్వప్నమయ్యేదుందా
ప్రేమకంత బలముందా?

*అభినందన(1988)*



ప్రేమకన్నా పాశముందా
పెంచుకుంటే దోషముందా
తెంచుకుంటే తీరుతుందా
పంచుకుంటే మరిచేదా

*ఆరాధన(1988)*

మోడుకు వున్నది మళ్ళీ చిగురింపు
చేసిన తప్పుకు లేదట మన్నింపు
ఏడ్చినా నవ్వినా వున్న మనసొకటె
కోరిన మారిన రాదులే ఇంకొకటి

*గాంధీనగర్ రెండో వీధి (1988)*

గాలిబు రాసినది ప్రేమ కవనము
ఖయ్యాము కోరినది పానకలశం
మనసుకు చావు - లేకున్నది
మనిషికి ఎపుడో - రానున్నది

*ప్రేమ (1988)*



ఒక మంచి నేస్తముంటె లేనిది లేదు
అది ఎన్ని జన్మలైనా మాసి పోనేపోదు
ధనమెంతున్నా అది దొరకదురా
మనసెంతున్నా అది చాలదురా
నీదని నాదని లేనిదే చెలిమిరా

*మిష్టర్ హీరో (1988)*